
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప
జిల్లా వార్తలు
7
ఆదివారం 19 అక్టోబరు 2025



క్యాసినో టూర్







- రూ.లక్ష కడితే ఫ్లైట్ టికెట్లతో సహా అన్నీ..
- నిమిషాల్లో వేలు, లక్షలు గెలవచ్చంటూ ప్రలోభం
- డబ్బులున్న యువతకు ఎరవేస్తున్న నయా గ్యాంగులు
- నాన్‌స్టాప్‌గా తాగి, తిని, ఆడి ఎంజాయి చేయచ్చని ఆఫర్లు
- నెలనెలా వందమందితో ప్రొద్దుటూరు నుంచి గోవాకు ట్రిప్పు
- 23వ తేదీన ఖరారైన ట్రిప్పు?

ప్రొద్దుటూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అసాంఘికాలైన మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లు, జూదానికి నిలయంగా పేరు తెచ్చుకున్న ప్రొద్దుటూరులో ఇప్పుడు క్యాసినో పేరు వినిపిస్తోంది. క్యాసినో అంటే టక్కున గుర్తొచ్చే పేరు గోవా. లగ్జరీగా బతకాలి, అనతికాలంలోనే కోటీశ్వరులు అయిపోవాలని కలలుకనే వారికి క్యాసినో పేరుతో వల వేస్తున్నారు. నిమిషాలు, గంటల వ్యవధిలో వేలు లక్షలు సంపాదించవచ్చని ఆశచూపి డబ్బులున్న యువతకు గాలం వేస్తున్నారు. ముఖ్యంగా ప్రొద్దుటూరు వ్యాపార వర్గంలోని వారి పిల్లలకు, జూదానికి బానిసైన వారికి ఎరవేసి ప్రొద్దుటూరు టు గోవా క్యాసినో టూర్ ట్రిప్పులు నడిపిస్తున్నారు. ఇందులో వైఎంఆర్‌కాలనీకి చెందిన ఓ వ్యక్తి హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం మానేసి ఈ నయా గ్యాంగు నడుపుతున్నట్లు సమాచారం. ఇందుకు కొందరు అధికార పార్టీకి చెందిన వ్యక్తుల అండ ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

రూ.లక్ష కడితే చాలు..

గోవా క్యాసినో టూర్‌కు వెళ్లాలంటూ లక్ష రూపాయలు నయా గ్యాంగుకు డిపాజిట్ కట్టాలి. వారిని ప్రొద్దుటూరు నుంచి బస్సుల్లో బెంగళూరు, హైదరాబాద్, చెన్నై నగరాలకు ఎవరికీ అనుమానం రాని రీతిలో రమ్మని అక్కడి నుంచి విమానాల ద్వారా గోవా తీసుకెళుతున్నారు. చిన్నచిన్న బ్యాచ్‌లుగా దాదాపు వందమందిని సిద్ధం చేస్తారు. వీందరినీ ఒకేరోజు గోవాకు తీసుకెళతారు. అక్కడికి వెళ్లాక ప్రత్యేకంగా ఏసీ రూమ్స్ బుక్ చేసి వారికి తిన్నంతా తిండి, తాగినంత మందు పోస్తారు. దీనికయ్యే డబ్బులు పట్టుకుని మిగతా డబ్బుకు కాయిన్స్ ఇస్తారు. క్యాసినో, మందు కాకుండా వేరే వ్యసనం ఉండేవారికి కూడా అన్ని ఏర్పాట్లు చేస్తారు. దీనికయ్యే ఖర్చులు ఎవరికి వారే భరించుకోవాలని ముందే చెప్తారు. కాయిన్స్ తీసుకున్నవారు గోవాలో ఎంపిక చేసుకున్న క్లబ్‌లకు వెళతారు. అక్కడ క్యాసినో ఆడితారు. క్యాసినోలో డబ్బుపెట్టి పోగొట్టుకునే వారే ఎక్కువ. మెజారిటీగా లోపల బయట జూదం, మంగతాయ ఆడిస్తున్నట్లు సమాచారం. దీంట్లో వస్తే వేలు, లక్షలు.. లేదంటే ఎంజాయి చేసి ఖాళీ చేతులతో ఇంటికి చేరుకుంటారు. కొందరు బాండ్లు రాసి అప్పులు చేసి మరీ ఆట ఆడతారు. ఇలా దాదాపు మూడు లేదా నాలుగు రోజులు ఈ ట్రిప్పులు ప్లాన్ చేసి నయా గ్యాంగులు వ్యవహారం నడుపుతున్నాయి.

లక్షల రూపాయలతో గోవాకు పయనం

ఏపీలో జూదం ఇతర అసాంఘిక కార్యకలాపాలు సాగించాలంటే కష్టమని గోవా, థాయ్‌లాండ్, దుబాయి, సింగపూర్‌లకు సైతం ప్రొద్దుటూరు నుంచి వెళుతున్నారని చెబుతున్నారు. తాజాగా ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మూడురోజులు గోవాకు ట్రిప్పు వెళ్లేవారు తయారయ్యారని ప్రొద్దుటూరులో బహిరంగంగా ప్రచారం సాగుతోంది. గోవాకు వెళ్లాలంటే రూ.లక్ష ఉంటే చాలు. అయితే కొంతమంది రూ.పది లక్షలు కూడా తీసుకెళుతున్నారని అంటున్నారు. దీన్నిబట్టి ఈ గోవా క్యాసినో టూర్‌లో కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయని తెలుస్తోంది. గోవా ట్రిప్పులకు వెళ్లేవారు క్యాసినోలో డబ్బులు పోగొట్టుకుని అప్పుల్లో మునిగిపోతుంటే.. వీరిని తీసుకెళ్లేవారు మాత్రం అనతికాలంలోనే కోట్లకు పడగలెత్తుతున్నారని, బంగ్లాలు ఖరీదైన కార్లు కొంటున్నారని ప్రొద్దుటూరులో ప్రచారం సాగుతోంది.

క్యాసినో టూర్‌పై నిఘా నిల్

ప్రొద్దుటూరు టు గోవా క్యాసినో టూర్‌పై పోలీసుల నిఘా అంతంతమాత్రమే ఉంది. ఇంటలిజెన్స్ స్పెషల్ బ్రాంచ్‌తో పాటు పోలీసు అధికారులకు సైతం ఈ నయా గ్యాంగుల కార్యకలాపాలు తెలిసినా.. ఇక్కడ జరగడం లేదుకదా అని ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ ఈ వ్యవహారం ఇక్కడి యువతపై తీవ్ర ప్రభావం చూపుతుండటంతో దీనిని అడ్డుకోవాల్సిన బాధ్యత పోలీసులకు ఉందని ప్రజలు అంటున్నారు.

ఇద్దరు ఎస్‌ఐల సస్పెన్షన్

కడప క్రైం / కొండాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు ఎస్‌ఐలు సస్పెండ్ అయ్యారు. ఈ ఏడాది మార్చి 30వ తేదీన చౌటపల్లె గ్రామం వద్ద ఓ వ్యక్తి చనిపోయాడు. తన భర్తను హత్య చేశారంటూ అప్పట్లో మృతుడి భార్య పెండ్లిమర్రి ఎస్‌ఐ మధుసూదనరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాటు కేసు నమోదుచేయకుండా కాలయాపన చేశారు. దీంతో మృతుడి తండ్రి ఈ నెల 3వ తేదీన పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోస్టుమార్టం నివేదికలో కూడా విష ప్రయోగమని నిర్ధారించడంతో ఈ కేసు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్‌ఐ మధుసూదనరెడ్డిని సస్పెండ్ చేస్తూ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే.. కొండాపురం మండలంలోని తాళ్లప్రొద్దుటూరు ఎస్‌ఐ హృషికేశ్వర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ శనివారం డీఐజీ ఉత్తర్వులు జారీచేశారు. ఫ్యాక్షన్ గ్రామమైన మండలంలోని టి.కోడూరులో శాంతిభద్రతల పట్ల నిర్లక్ష్యం వహించడంతో పాటు ఈ గ్రామంలో ఉన్న సోలార్ కంపెనీ భూముల వ్యవహారంలో ఆయనను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మొక్కల పెంపకంతోనే మనుగడ



దువ్వూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో మొక్క నాటుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

దువ్వూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో కోట్లాది ప్రాణుల మనుగడ సాధ్యమని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. మనిషి జీవిత కాలంలో కనీసం పది చెట్లు పెంచే విధంగా ప్రతి ఒక్కరు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని తెలిపారు. దువ్వూరులో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మొదట మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌తో కలిసి మొక్కలు నాటారు. అనంతరం కార్యాలయ ఆవరణ నుంచి కొంత దూరం సైకిల్ ర్యాలీ తర్వాత విద్యార్థులతో కలిసి నడుచుకుంటూ ర్యాలీ కొనసాగించారు. స్థానిక మూడు రోడ్ల కూడలికి చేరుకుని అక్కడ విద్యార్థులతో మానవహారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనువైన చోట ఖాళీ జాగా కనపడితే మొక్కలు నాటాలని ఇందులో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. జీవిత కాలంలో వంద మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో దాదాపు 3 లక్షల మంది ఉన్నారని ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటాలని కోరారు. ఊపిరి లాంటి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, పలు పాఠశాలల విద్యార్థులతో పాటు ఎంపీడీవో సుబ్బారెడ్డి, తహశీల్దారు సంజీవరెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ రమణారెడ్డి, ఆ పార్టీ నాయకులు రాంబాబు, వెంకటసుబ్బయ్య, సురేశ్‌యాదవ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆయన తీరు వివాదాస్పదం

- పులివెందులకు కడప రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ బదిలీ
- ఆయన స్థానంలో రుచిత నియామకం



రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టిన రుచిత

కడప రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ సామంత్ నాయక్ వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆయన వైసీపీ ప్రభుత్వంలో 2022లో కాంట్రాక్ట్ పద్ధతిన విధుల్లో చేరారు. రైతు బజార్‌లో ఆయన చెప్పిందే వేదం అన్నట్టుగా సాగుతూ వచ్చింది. 2024 సాధారణ ఎన్నికలకు ముందు రైతు బజార్‌లో కూరగాయాల దుకాణం నడుపుతున్న ఓ మహిళా రైతు ఎస్టేట్ ఆఫీసర్ సామంత్ నాయక్ తనను వేధిస్తున్నారని పైఅధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన తన పలుకుబడి, అధికారంతో రైతుబజారు నుంచి బాధిత మహిళా రైతును తొలగించారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బాధితులు సామంత్ నాయక్ ఆగడాలపై రాష్ట్ర ప్రభుత్వానికి, సంబంధిత మంత్రికి, కడప, కమలాపురం ఎమ్మెల్యేలకు, ముఖ్య నాయకులకు పిర్యాదు చేశారు. ఎమ్మెల్యేలు హెచ్చరించినా ఆయనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కడప మార్కెటింగ్ శాఖ ఈ ఏడాది జూలైలో సామంత్‌నాయక్‌ను విధుల నుంచి తొలగించింది. ఆయన హైకోర్టును ఆశ్రయించి ఇంటీరియం ఆర్డర్ తెచ్చుకున్నారు. దీంతో ఆయనను తిరిగి నెల క్రితం విధులో చేర్చుకున్నారు. అయినా అతనిలో మార్పు రాకపోవడంతో శుక్రవారం పులివెందుల రైతుబజార్‌కు, అక్కడ ఎస్టేట్ ఆఫీసర్‌గా ఉన్న రుచితను కడప రైతుబజార్‌కు బదిలీ చేశారు. పై అధికారుల పట్ల నిర్లక్ష్యం, ఆదేశాలు పాటించకపోవడం, సమయానికి విధులకు రాకపోవడం వంటి కారణాల వలన కడప రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ సామంత్‌నాయక్‌ను పులివెందులకు బదిలీచేశామని మార్కెటింగ్‌శాఖ ఏడీ ఆజాద్‌వల్లి తెలిపారు. శనివారం కడప రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్‌గా రుచిత బాధ్యతలు చేపట్టారు.

ఉల్లిగడ్డలు పశువుల పాలు



ఉల్లిగడ్డలను తింటున్న గొర్రెలు

వీరపునాయునిపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు అష్టకష్టాలు పడి ఉల్లి పంటను సాగుచేశారు. దిగుబడి చేతికి వచ్చే సమయంలో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఉల్లిగడ్డలకు గిట్టుబాటు ధరలేక ఇబ్బంది పడుతున్నారు. కనీసం కూలీల ఖర్చులు కూడా రాకపోవడంతో కొంతమంది రైతులు పొలాల్లోనే వదిలేశారు. మరికొందరు ధర లేదని ఉల్లిగడ్డలను పారబోశారు. వీరపునాయునిపల్లె మండలంలోని గంగిరెడ్డిపల్లెలో శనివారం రైతులు ఉల్లిగడ్డలను గొర్రెలకు వదిలేశారు.

రిమ్స్ వైద్య కళాశాలకు అదనంగా పీజీ సీట్లు

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులో ఉన్న రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాలలోని పీడియాట్రిక్స్ విభాగానికి అదనంగా నాలుగు పీజీ సీట్లను కేటాయించారు. దీనితో పీడియాట్రిక్ విభాగానికి పీజీ సీట్ల సంఖ్య ఏడుకు చేరుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, పీడియాట్రిక్ విభాగానికి చెందిన హెచ్‌ఓడీ డాక్టర్ వంశీ వైద్యులను అభినందించారు.

జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్

కడప, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కడప జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్‌గా ఆదర్శ్‌రాజేంద్రన్ నియమితులయ్యారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఈయన ప్రస్తుతం అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్ ఎఫ్ఏసీగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జీఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ కలెక్టర్ నియామకం జరిగే వరకు ఈయన ఎఫ్ఏసీ బాధ్యతలు నిర్వర్తిస్తారు.

మాయా పెట్టె.. ఆటపాటలు తెచ్చే..

9

- పెట్టెలో ఆకర్షణీయమైన 59 రకాల వస్తువులు
- ఆటపాటలతో విద్యాభ్యాసం
- చిన్నారుల్లో పునాది పటిష్టతకు అడుగులు
- పాఠశాల విద్యలో కొత్త సంస్కరణలు

మత స్వేచ్ఛ చట్టం అమలు చేసేందుకు కృషి

9

- ప్రాంత ధర్మాచార్యుల సదస్సులో పీఠాధిపతులు

సూపర్ జీఎస్టీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



మంత్రి లోకేశ్, గవర్నర్‌తో ఖుషి మహమ్మద్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేశ్ నుంచి ప్రశంసలు అందుకున్న కోటిరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల ఆర్ట్స్ విభాగం విద్యార్థిని ఖుషిమహమ్మద్‌ను ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.రవీంద్రనాథ్ అభినందించారు. ఈ విద్యార్థిని తండ్రి యూనస్‌అహ్మద్ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి కాగా తల్లి అడ్వకేట్. విద్యార్థిని ప్రస్తుతం బీఏ పొలిటికల్ సైన్స్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ఈ నెల 13, 14 తేదీల్లో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పై ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం నిర్వహించిన పోటీల్లో ఈ విద్యార్థిని పాల్గొని ప్రతిభ చూపారు. ఈ నేపథ్యంలో 16వ తేదీ కర్నూలులో జరిగిన సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ ముగింపు కార్యక్రమానికి హాజరైన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, గవర్నర్ అబ్దుల్ నజీర్ ఖుషిమహమ్మద్‌ను అభినందించారు. ఈ సందర్భంగా శనివారం కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేశ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రమణరావు, బోధన, బోధనేతర సిబ్బంది విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

పెద్దదర్గా ఉర్సు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



పెద్దదర్గా ఉర్సు ముందస్తు ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పీర్ దర్గా (పెద్దదర్గా) ఉర్సును ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్‌ఎస్ హాలులో పెద్దదర్గా ఉత్సవాల నిర్వహణ, ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్‌తో పాటు జేసీ అదితిసింగ్, ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దదర్గా ఉత్సవాలను కడప నగర పండుగగా, మత సామరస్యాన్ని ప్రతిబింబించేలా నిర్వహించాలన్నారు. ముందస్తు ప్రణాళికతో అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేయాలన్నారు. దర్గా కమిటీ సభ్యులు, జిల్లా యంత్రాంగం, అన్నిశాఖల అధికారులు, దర్గా మేనేజ్‌మెంటు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం చేయాలన్నారు. ప్రధానంగా పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పోలీసుశాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ ద్వారా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. 108, అంబులెన్స్ తదితర వాహనాలతో పాటు అత్యవసర మందులు కూడా అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ నుంచి అమీన్‌పీర్ దర్గా ప్రాంతానికి షటిల్ బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ ఉర్సు సందర్భంగా పాఠశాలలకు సెలవు ప్రకటించాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పెద్దదర్గా ఉత్సవాల సందర్భంగా నిర్దేశించిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అదనపు భద్రతా సిబ్బందిని నియమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జిల్లా మైనార్టీ ఆఫీసర్ ఇదయతుల్లా, అడిషనల్ ఎస్పీ ప్రకాశ్‌బాబు, జిల్లా సమాచార శాఖ అధికారి పద్మజ, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ రమణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నాగరాజు, జిల్లా అగ్నిమాపక అధికారి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఆహ్వానం



ముఖ్యమంత్రిని కలిసి ఆహ్వానిస్తున్న పెద్దదర్గా పీఠాధిపతి

కడప కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పీర్ దర్గా (పెద్దదర్గా) ఉరుసు మహోత్సవాలకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ కేఎస్‌ఎస్ ఆరిఫుల్లా హుస్సేని శనివారం విజయవాడలో ఆహ్వానం పత్రం అందజేశారు. జాతీయస్థాయిలో ఖ్యాతిగాంచిన ఉరుసు మహోత్సవాలు నవంబరు 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకూ జరుగనున్నాయన్నారు. ఈ మహోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రిని కోరారు. స్పందించిన సీఎం ఉరుసు ఉత్సవాలకు ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయని వారిని అడిగి తెలుసుకున్నారు. ఉరుసు మహోత్సవాలు దిగ్విజయంగా జరిగేలా సహకారం అందించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అమీన్‌పీర్ దర్గా మేనేజర్ ఎం.అలీఖాన్, బాకీ ఉల్లాఖాన్ తదితరులున్నారు.

గొప్ప ఇంజనీర్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి


హాజరైన విద్యార్థులు

సీకేదిన్నె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను గొప్ప ఇంజనీర్లుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల పని చేస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం రాయచోటి రోడ్డులోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చేరిన విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెషర్స్‌డే కో-ఆర్డినేటర్ డాక్టర్ శశికుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి విద్యనే కాంతిదీపం

పులివెందుల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుం బానికి విద్యతోనే ఒక కాంతి దీపంలా నిలుస్తారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు ఆయనను కలిసి పలు పాఠశాలల్లో ఉపాధ్యా యుల కొరతను తీర్చినందుకు వారు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. అహోబిలాపురం పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసుల రెడ్డి, రమణప్పసత్రంబడి హెచ్‌ఎం చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

ప్రమిదలకు భలే గిరాకీ..!









కడప కల్చరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):. హిందువుల పండుగల్లో కెల్లా దీపావళి పండుగకు ప్రత్యేకమైన ది. సోమవారం దీపావళి పర్వదినానికి జిల్లా ప్రజలు సంసిద్ధులవుతున్నారు. ఇప్పటికే నగరంలోని మున్సిపల్ స్టేడియం వద్ద టపాసుల విక్రయాలు జరుగుతున్నాయి. కాగా కార్తీకమాసంలో వచ్చే మొదటి పర్వదినం దీపావళి. ప్రతి ఇంటి ముందు ప్రమిదల్లో దీపాలు వెలిగించి వరుస క్రమంలో ఏర్పాటు చేసి దీపకాంతుల్లో టపాసులు కాల్చి పండుగనుజరుపుతారు. ఆ మేరకు జ్యోతులు, ప్రమిదలు విక్రయాలు జోరందు కుంటున్నాయి. నగరంలోని వివిధ కూడళ్లల్లో ప్రమిదలు విక్రయాలు పుంజుకున్నాయి.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

వేంపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు జ్వరాలు వస్తే వెంటనే అప్రమత్తమై వైద్యపరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొయిద్దీన్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీని వైద్యబృందంతో కలిసి ఆయన సందర్శించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఇతర అధికారులతో చర్చించారు. మలేరియా సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరీ భగవాన్ జయంతి

వేంపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ కులదైవం వైద్య నారాయణ ధన్వంతరీ భగవాన్ జయంతిని వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పండుగలా జరుపుకొన్నారు. నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అధ్యక్షుడు రత్నం, గౌరవాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, వీరయ్య, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు వడ్డెరల ఆత్మీయ సమావేశం

కడప మారుతీనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10గంటలకు కడప ప్రెస్‌క్లబ్‌లో వడ్డెరుల ఆత్మీయ సమవేశం జరగనున్నట్లు ఆ సంఘం నాయకుడు రాయచోటి వెంకటసుబ్బయ్య తెలిపారు. ఇందులో ఆ సంఘం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నుకోనున్నట్లు స్పష్టం చేశారు.

సదస్సును జయప్రదం చేయండి

కడప సెవెన్ రోడ్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ ఆదివారం కడప బీసీ భవన్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మతోన్మాదుల ప్రేరేపిత న్యాయవాది రాకేష్ కిషోర్ దాడిచేయడం న్యాయవ్యవస్థనే అవమానపరచడం అన్నారు. సదస్సుకు ప్రజలు, ప్రజాస్వామికవాదులు,మేధావులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలి

కమలాపురం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు తన పొలంలో భూసార పరీక్షలు చేయించుకుని అందుకు ఆధారంగానే ఎరువులు వాడాలని ఏవో సరస్వతి, పద్మజ తెలిపారు. శనివారం మండలంలోని కోగటం, పందిళ్లపల్లె, టి.చదిపిరాళ్ల గ్రామాల్లో రైతులకు భూసార పరీక్ష నిర్వహించారు. కమలాపురంలో జిప్సం అందుబాటులో ఉందని కావలసిన రైతులు రైతు సేవా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులకు మట్టి పరీక్ష పత్రాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు శిల్ప, నిహారిక, సునీల్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పులివెందుల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టేందుకు కంకణబద్ధులు కావాలని డిప్యూటీ హెచ్‌ఈఓ ఆర్.ప్రసన్నలత పిలుపునిచ్చారు. శనివారం స్థానిక నగరిగుట్టలోని యూపీహెచ్‌సీలో డాక్టర్ స్నేహ ప్రత్యూష ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పఢావో పై ఏఎన్‌ఎమ్, ఆశాకార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బుడ్డశనగలు అందించాలి

పులివెందుల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు బుడ్డశనగలు వెంటనే అందించాలని పులివెందుల ఆర్డీఓ చిన్నయ్యను కాంగ్రెస్ నాయకులు కోరారు. శనివారం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చిన్నయ్యను కలిసి వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ నేతలు ధ్రువకుమార్‌రెడ్డి, నాయకులు ఖాదర్‌వలి, రమేష్, ఆదిల్ పాల్గొన్నారు.

21 నుంచి డివిజన్ లెవెల్ ఎస్‌జీఎఫ్ గేమ్స్, స్పోర్ట్స్ సెలెక్షన్స్

పులివెందుల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి డివిజన్ లెవెల్ ఎస్‌జీఎఫ్ గేమ్స్, స్పోర్ట్స్ సెలెక్షన్స్ జరుగుతాయని ఎస్‌జీఎఫ్ డివిజనల్ కోఆర్డినేటర్ ఫ్రాన్సిస్ రవికుమార్, జిల్లా కార్యదర్శి విక్టర్ ఇమ్మానియేల్, ఆర్గనైజర్స్ జీవీసీ కేల్కర్, టి.ప్రభాకర్, గోవర్దన్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 21వ తేదీన అండర్-14,17 విభాగంలో బాలురు, 22వ తేదీన బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్,యోగా పోటీలు, 23న అండర్-14, 17 విభాగంలో బాలబాలికలకు అథ్లెటిక్స్ ఎంపికలు జరుగుతాయన్నారు. పులివెందులలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల రవణప్ప సత్రం మైదానంలో జరుగుతాయన్నారు.

పీ4 మార్గదర్శకురాలిగా భూమిరెడ్డి ఉమాదేవి

పులివెందుల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి పీ4 మార్గదర్శకురాలిగా కాంబల్లె మాజీ సర్పంచు భూమిరెడ్డి ఉమాదేవి నిలిచారు. శనివారం సౌజన్య కుటుంబం ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డికి ఆయన సతీమణి ఉమాదేవికి కృతజ్ఞతలు తెలిపారు. పులివెందుల మండలంలోని మోట్నూతలపల్లెకు చెందిన రెడ్డిబోయిన గంగాధర్ అనుకోకుండా మరణించాడు.ఈ కుటుంబ దీనస్థితిని చూసి ఉమాదేవి ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

కల్తీ మద్యంపై ఎక్సైజ్ సీఐ తనిఖీ

వేంపల్లె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో కల్తీ మద్యం ఒక బ్రాండ్ పేరుతో మరో బ్రాండ్ విక్రయిస్తున్నారని ప్రచారం, ఫిర్యాదులు ఎక్సైజ్ అధికారుల దృష్టికి రావడంతో పులివెందుల ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తనిఖీ చేపట్టారు. కల్తీ చేసిన, నాసిరకం మద్యం అమ్మినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల మేరకే విక్రయాలు చేయాలని దుకాణదారులను ఆదేశించారు.

ఆందోళనలకు సంఘీభావంగా నిలవాలి



ఎల్‌ఐసీ యూనియన్ 14వ శ్రామిక మహిళా సదస్సులో ఉద్యోగులు

కడప నాగరాజుపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రమదోపిడీకి గురవుతున్న మహిళా కార్మికుల ఆందోళనలకు బీమా, బ్యాంకింగ్, తదితర రంగాల్లోని మహిళా ఉద్యోగులు సంఘీభావంగా నిలవాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం జోనల్ మాజీ ఉపాధ్యక్షులు ఎస్‌కె గీత పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎల్‌ఐసి డివిజనల్ కార్యాలయ ఆవరణంలో ఎల్‌ఐసీ యూనియన్ 14వ శ్రామిక మహిళా సదస్సు వై.శ్రీవాణి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీరాష్ట్ర ఎల్‌ఐసీ శ్రామిక మహిళా కన్వీనర్ సూర్యప్రభ,యూనియన్ అధ్యక్షులు అవధానం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి):కడప నగరం రైల్వే కాలనీ మేరీ నగర్‌లో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సాంకేతిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వడ్డెరల పక్షపాతి చంద్రబాబు


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కడప మారుతీనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వడ్డెరల అభివృద్ధి, సంక్షేమం కోసం చంద్రబాబు మైనింగ్ లీజుల్లో 15 శాతం మేరకు వడ్డెరులకు, వడ్డెర సొసైటీలకు కేటాయించేలా వచ్చే క్యాబినెట్ సమావేశం నాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించడం హర్షణీయమని వడ్డెర సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పేర్కొన్నారు. జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు బత్తల జానకిరాం, జిల్లా అధ్యక్షుడు దేరంగుల శ్రీనివాసులు (వీరబల్లె సింహాద్రి), వర్కింగ్ ప్రెసిడెంటు శ్రీను , నాయకులు గంపా శివప్రసాద్ పలువురు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

పులివెందుల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పులివెందుల జేఎన్టీయూ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్దన్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జేఎన్టీయూ కళాశాలలో సర్వజ్ఞ 2కె25 టెక్నికల్,వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.శేషమహేశ్వరమ్మ, హెచ్‌ఓడీ డాక్టర్ మురళి, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

పులివెందుల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మండలంలో ఉన్న అక్రమలేఅవుట్లను క్రమ బద్ధీకరించుకోవాలని కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ కృష్ణసింగ్ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లను గుర్తించామని వాటికి ఈనెల 24వ తేదీలోపు రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పెద్దగుర్రప్ప, జి.విజయజ్యోతి, పి.దీప, వి.నాసరయ్య, నారాయణస్వామినాయక్ పాల్గొన్నారు.

పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

సీకేదిన్నె, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పశువైద్య సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని పశుసంవర్ధకశాఖ సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలంలోని పబ్బాపురం, మామిళ్లపల్లె, నాగిరెడ్డిపల్లె పశువైద్య కేంద్రాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో చంద్రకిశోర్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

దామోదర మాసం పవిత్రం


ఇస్కాన్ టెంపుల్‌లో పూజలందుకుంటున్న క్రిష్ణబలదేవులు

చెన్నూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రిష్ణ పరమాత్ముడికి ఎంతో ఇష్టమైన దామోదర మాసంలో ఆయనకు చేసే పూజల వల్ల ఎన్నో ఫలితాలు పొందుతారని కొండపేట ఇస్కాన్ టెంపుల్ గురువు వరప్రసాద్ ప్రభు అన్నారు. దామోదర మాసం ఈ నెల 7న ప్రారంభమై నవంబరు 6 వరకు ఉన్న సందర్భంగా ఈ నెలలో శ్రీమన్నారాయణుడికి ఎలాంటి పూజలు చేసినా అవి రెట్టింపు ఫలితాలు ఇస్తాయని అన్నారు. ధన త్రయోదశి సందర్భంగా ఇస్కాన్ టెంపుల్‌లో క్రిష్ణ బలదేవులకు శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. అలాగే చెన్నూరు వేంకటేశ్వర ఆలయంలోస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

పర్యావరణ సమతుల్యత మనందరి బాధ్యత


కడప..ర్యాలీలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు, విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయంలో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర దివస్ సందర్భంగా క్లీన్‌ఎయిర్ చైతన్యర్యాలీ నిర్వహించారు. ర్యాలీని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ ప్రారంభించి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యత కాపాడడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.లలిత ,ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి,డాక్టర్ సునీత, ఆచార్యులు ఈశ్వరరెడ్డి, ఎ.మధు సూదనరెడ్డి, మాధవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరు..: కాలుష్య నివారణతోనే ఆరోగ్యవంతమైన జీవితమని ఎంపీడీఓ కిరణ్‌మోహనరావు అన్నారు. స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బస్టాండు కూడలిలో అధికారులు, ప్రజాప్రతినిధులు పార్టీ నాయకులు విద్యార్థులలోకలిసి ప్రతిజ్ఞ చేయించారు. అలాగే తూర్పువీధి గంగమ్మను నిలిపే ప్రాంతంలో ఉన్న దారిలో మొక్కల నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు, ఎంపీపీ చీర్లసురేశ్‌యాదవ్, టీడీపీ కన్వీనరు విజయభాస్కర్ రెడ్డి, వైసీపీ కన్వీనరు జీఎన్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటసుబ్బయ్య,కార్యదర్శి రామసుబ్బారెడ్డి, ఎంఈవో సునీత,ఆవులపవన్‌కుమార్‌రెడ్డి, షబ్బీర్‌హుస్సేన్,అహ్మద్ పాల్గొన్నారు. కాగా రామనపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో సురేశ్ బాబు, మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి ,టీడీపీ నేతలు సుబ్రహ్మణ్యం, మన్నూరు అక్బర్, కార్యదర్శి గురవేశ్వర్ రావు, హెచ్‌ఎం ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా పర్యావరణ పరిరక్షణ కోసం అందరం కృషి చేస్తామని సీఐ క్రిష్ణారెడ్డి అన్నారు. చెన్నూరు పోలీసుస్టేషన్‌లో పోలీసు సిబ్బందితో కలిసి పరిసరాలు పరిశుభ్రం చేశారు.

కడప క్రైం..: స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు సర్కిల్ కార్యాలయాలు, స్టేషన్ ఆవరణంలో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించారు. సర్కిల్ కార్యాలయాలు, స్టేషన్‌ఆవరణను శుభ్రం చేయడంతో పాటు డ్రైనేజీ కాల్వలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల టౌన్..: స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో భాగంగా పులివెందుల పట్టణంలోని లయోలా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఫాదర్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ వనా చిన్నప్ప, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు కళ్యాణిరెడ్డి, వెలవలి సుధీర్ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ప్రధాన కూడలి వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..:విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించి స్వచ్ఛమైన గాలిని సృష్టిద్దామని అధికారులు, అధ్యాపకులు పిలుపునిచ్చారు. శనివారం ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు చిన్నరంగాపురం గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛమైన గాలి అనే అంశంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ మాధవ మాట్లాడారు. అలాగే పులివెందులలోని నగరిగుట్టలోని యూపీహెచ్‌సీలో మున్సిపల్ కమిషనర్ రాముడు, వైద్యాధికారి స్నేహప్రత్యూష మొక్కలు నాటారు. అనంతరం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమ అధికారి ఇంజనీర్ నజ్మా, అధ్యాపకుడు డాక్టర్ సాయిశ్రీనివాస్, పీడీ డాక్టర్ రాజశేఖర్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె..: మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం కోసం సమష్టి కృషి అవసరమని అధికారులు సూచించారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలోపంచాయతీ ఈఓ నాగభూషణం, ఎంపీడీఓ కుళాయమ్మ, ఈఓఆర్డీ రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాయా పెట్టె.. ఆటపాటలు తెచ్చే..


బొమ్మలతో కూడిన మాయాపెట్టె



- పెట్టెలో ఆకర్షణీయమైన 59 రకాల వస్తువులు
- ఆటపాటలతో విద్యాభ్యాసం
- చిన్నారుల్లో పునాది పటిష్టతకు అడుగులు
- పాఠశాల విద్యలో కొత్త సంస్కరణలు

ప్రధాన లక్ష్యం

పిల్లల్లో సృజనాత్మకత, ఆలోచనాశక్తి, సంభాషణ నైపుణ్యాలను పెంచి అభ్యాసాన్ని ఆనందదాయకంగా చేయడమే జాదూయి పిటార ప్రధాన లక్ష్యం. పుస్తక భారం కాకుండా, ఆటల్లోనే విద్య అనే నూతన శకానికి ఇది ఆరంభమని చెప్పవచ్చు.


మాయాపెట్టెలోని ఆట వస్తువులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పిల్లల చిన్నచిన్న చేతుల్లో ఇపుడు మాయా పెట్టె. పేరు జాదూయి పిటార. కానీ ఇది మాయలు, మంత్రాలు కాదు. విజ్ఞాన భాండాగారం అని చెప్పాలి. పునాది దశలో పిల్లలు ఆటల ద్వారా నేర్చుకునేలా చేయడమే దీని లక్ష్యం. జాదూయి పిటార అనేది భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 3-8ఏళ్ల పిల్లల కోసం ఆట ఆధారిత అభ్యాస సామగ్రి. ఇందులో కథలు, తోలుబొమ్మలు, పజిల్స్, పోస్టర్లు, ఫ్లాష్‌కార్డులు వంటివి కలిగి ఉంటుంది. ఇవి పిల్లల ఉత్సుకతను పెంచి స్థానిక భాషలు, సంస్కృతులను ప్రతిబింబిస్తాయి. ఇ-జాదూయి పిటార కూడా అందుబాటులో ఉంది. అలాగే ఏఐ ఆధారిత చాట్‌బోట్స్, టెలీగ్రామ్, వాట్సప్ ద్వారా లభిస్తుంది.

జాదూయి పిటార అంటే...

జాదూయి పిటార అంటే మాయా పెట్టె అని అర్థం. ఇది ముఖ్యంగా 3 నుంచి 8 సంవత్సరాల పిల్లల కోసం రూపొందించిన ఆట ఆధారిత అభ్యాస సామగ్రి. ఈ పెట్టెలో కథల పుస్తకాలు, బొమ్మలు, పజిల్స్ ఫ్లాష్‌కార్డులు, పోస్టర్లు, వర్క్‌బుక్కులు, ఆంగ్లంతో పాటు స్థానిక భాషలలో కూడా అందుబాటులో ఉండే వివిధ రకాల అభ్యాస వస్తువులు ఉంటాయి. ఇవి అభ్యాసానికి చురుకైన, అభివృద్ధికి తగిన విధానాన్ని అందిస్తాయి, ఇది విద్యా నైపుణ్యాలకు పునాది వేయడమే కాకుండా చిన్నారుల్లో అవసరమైన సామాజిక, భావోద్వేగ అభిజ్ఞా సామర్థ్యాలు, ఇంద్రియ గ్రహణ నైపుణ్యాలను కూడా పెంపొందిస్తుంది.

ఆడుతూ నేర్చుకోవడం అనే సూత్రాన్ని సాకారం చేస్తూ ఈ కార్యక్రమం రూపుదిద్దుకుంది. పిల్లలు బొమ్మలు, పజిల్స్, కథలు, ఫ్లాష్‌కార్డులు, తోలుబొమ్మలతో ఆడుతూ అక్షరాలు, అంకెలు, రంగులు, ఆకారాలు నేర్చుకుంటారు. పాఠం అంటే భయం కాదు.. ఆటల్లోనే పాఠం అనే భావనను పెంపొందిస్తోంది.


ఆట ఆధారిత అభ్యాసం

వర్క్‌బుక్కులు

భారతీయతకు ప్రతిబింబం

జాదూయి పిటార కేవలం ఆటపాటలకే కాదు.. భారతీయ సంస్కృతి, స్థానిక భాషలు, సామాజిక విలువలను ప్రతిబింబించేలా రూపొందించబడింది. పిల్లలు తమ చుట్టూ ఉన్న గ్రామం, కుటుంబం, పండుగలు, సంప్రదాయాలను నేర్చుకుంటూ ఎదుగుతారు.


తోలుబొమ్మలు

ఆటలతో కూడిన బోధన..



పిల్లలకు ఆటలతో కూడిన బోధన కల్పించాలనే లక్ష్యంతో జాదూయి పిటార కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోంది. మాయాపెట్టెలో కథలు, బొమ్మలు, పజిల్స్, పోస్టర్లు ఇలా 59 రకాల వస్తువులు ఉంటాయి. ప్రధానంగా పిల్లలకు పాటలతో వినోదం కల్పిస్తూ విజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలలకు మాయాపెట్టె పంపించడం జరిగింది. శనివారం నాటికి అన్ని పాఠశాలల్లో మాయాపెట్టె అందుబాటులో ఉంటుంది. **- నిత్యానందరాజులు, ఎస్ఎస్ఏ ఏపీసీ**

మత స్వేచ్ఛ చట్టం అమలు చేసేందుకు కృషి

- ప్రాంత ధర్మాచార్యుల సదస్సులో పీఠాధిపతులు


పీఠాధిపతుల సదస్సులో మాట్లాడుతున్న విరజానందస్వామి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పీఠాధిపతులు అందరూ కలిసి ఏపీలో కూడా మత స్వేచ్ఛ చట్టం అమలులోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానందస్వామి తెలిపారు. మండలంలోని తోట్లపల్లె గ్రామంలో వెలసియున్న అచలానంద ఆశ్రమంలో శనివారం ప్రాంత ధర్మాచార్యుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో ఇప్పటికే 14రాష్ట్రాల్లో మత స్వేచ్ఛ చట్టం అమల్లోకి తెచ్చారని, ఏపీలో కూడా మత ప్రచార స్వేచ్ఛ చట్టం అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నామన్నారు. ప్రాంత ధర్మాచార్యుల సదస్సులో పాల్గొన్న పీఠాధిపతులు అందరూ కలిసి ఏడు ప్రధాన అంశాలను తీర్మానించడం జరిగిందని ఆయన తెలిపారు. భారతదేశ ఐక్యత, అఖండత, సాంస్కృతిక గుర్తింపు ధర్మంపై ఆధారపడి ఉన్నందున ధర్మాన్ని కాపాడడం ప్రతి పౌరుడి పవిత్ర కర్తవ్యమని, హిందూ దేవాలయాల నిర్వహణ ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేయాలని తీర్మానించారు. దేశంలోని ప్రతి పట్టణం, గ్రామంలో స్వామీజీలు, ఆధ్యాత్మిక నాయకులు అవగాహన కార్యక్రమాలు చేపట్టి కొన్ని ప్రభుత్వాలు రూపొందించిన మత మార్పిడి నిషేధ చట్టాలు ఏ మతానికి వ్యతిరేకం కాదన్నారు. భారత జాతిని బలహీన పరిచే కుల భాషా ప్రాంత బేధాలను అధిగమించి సాంస్కృతిక జాతీయ భావాలతో స్వశక్త సమర్థ భారత నిర్మాణానికి కలిసి రావాలని పిలుపునిచ్చారు. భారత యువత ధర్మాన్ని కాపాడడం అంటే దేశాన్ని కాపాడడమేనన్నారు. మోసపూరిత మత మార్పిడిల వల్ల సంస్కృతీ సాంప్రదాయాలు కోల్పోతే భవిష్యత్ తరాలు ప్రమాదంలో పడతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుండి దాదాపు 500 మంది పీఠాధిపతులు హాజరయ్యారు.

పారదర్శకంగా స్కేటింగ్ ఎంపికలు


స్కేటింగ్ పోటీల్లో చిన్నారులు

కడప స్పోర్ట్స్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో శనివారం స్కేటింగ్ ఎంపికలు పారదర్శకంగా జరిగాయి. ఉదయం 6గంటలకు యోగి వేమన యూనివర్శిటీలో రోడ్‌రేస్ పోటీలు నిర్వహించారు. ఇందులో వివిధ వయసు గల వారికి గ్రూపుల వారీగా ఈ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్‌ను అందించారు. అనంతరం కడప డీఎస్ఏ మైదానంలో రింక్ రేస్ ఎంపికలకు 4 నుండి 6, అలాగే 6 నుండి 8, 8 నుండి 10, 10 నుంచి 12, 12 నుంచి 15, 15 నుండి 18, 18 ఆపై వయసు గలవారికి పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్‌ను డీఎస్‌డీవో గౌస్‌బాషా, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ చంద్రావతి అందించారు. ఈ పోటీలకు అబ్జర్వర్‌గా ఆంజనేయులు, కోచ్‌లు విలియం కేరీ, మహేశ్, నాగేంద్ర, నారాయణ, శ్రీనివాస్, హర్ష, అనిల్ పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : డీఎస్‌డీవో

కడప స్పోర్ట్స్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి గౌస్‌బాషా స్పష్టం చేశారు. శనివారం స్థానిక డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో ఉన్న తన చాంబరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్ఏ మైదానంలో ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేలా ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, హాకీ, కబడ్డీ, జిమ్, స్కేటింగ్ తదితర క్రీడలకు సంబంధించి కోచ్‌లు ఉన్నారని, వాలీబాల్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్ క్రీడలకు ప్రస్తుతం కోచ్‌లు లేరని తెలిపారు. త్వరలో సంబంధిత క్రీడాకారుల ప్రధాన కార్యాలయం (విజయవాడ) నుండి ఆదేశాలు రానున్నాయని, అనంతరం కోచ్‌లు లేని క్రీడలకు సైతం కోచ్‌లు నియమించి క్రీడల పురోగతికి బాటలు వేస్తామన్నారు. మట్టిలో మాణిక్యాల్లాంటి గ్రామీణ క్రీడాకారులను గుర్తించి వారికి సరైన శిక్షణ ఇచ్చి ఉత్తమ ప్రతిభ గల క్రీడాకారులుగా తయారు చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రతిరోజూ ఉదయం 6 నుండి 8.30గంటల వరకు, అలాగే సాయంత్రం 4గంటల నుండి 6.30గంటల వరకు ఈ క్రీడా విభాగాల్లో బయట నుంచి వస్తున్న క్రీడాకారులకు స్టేడియంలో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం కోచ్‌లున్న క్రీడలకు ఒక్కో క్రీడకు 30మంది చొప్పున క్రీడాకారులు శిక్షణకు వస్తున్నారన్నారు.

క్రేన్ కిందపడి వృద్ధుడు మృతి


మృతి చెందిన వృద్ధుడు

ముద్దనూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధి పులివెందుల రోడ్డులోని పుల్లేరు వంక సమీపంలో శనివారం గుర్తుతెలియని వృద్ధుడు క్రేన్ కింద పడి మృతి చెందినట్లు సీఐ దస్తగిరి తెలిపారు. దాదాపు 65 సంవత్సరాలు ఉన్న గుర్తుతెలియని వృద్ధుడు నడుచుకుంటూ వెళుతుండగా క్రేన్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతుడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


జగదీష్ (ఫైల్)

చక్రాయపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబుళనాయునిపల్లెలో గండికోట జగదీష్ (18) ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. వారి వివరాల మేరకు... జగదీష్ తల్లిదండ్రులు కువైట్‌లో ఉండగా లక్కిరెడ్డిపల్లెలోని అవ్వ ఉండేవాడు. శుక్రవారం ఓబుళనాయునిపల్లెకు వచ్చి తల్లిదండ్రులకు ఫోన్ చేసి బైక్ కావాలని కోరడంతో వారు మందలించారని, అతనికి మతిస్థిమితం లేనట్లు కూడా తెలిపారు. బైక్ కొనివ్వలేదనే మనస్థాపంతో శుక్రవారం రాత్రి ఉరి వేసుకోగా శనివారం గుర్తించినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లెకు తరలించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి

ఓబులవారిపల్లె, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తిని ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో చిన్నఓరంపాడుకు వెళ్లే మార్గంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ వ్యక్తి వాహనం అదుపు తప్పడంతో గాయాలపాలయ్యాడు. దీనికి తోడు మూర్ఛ వ్యాధి రావడంతో అదే సమయంలో అటు వైపు వెళుతున్న పోలీసులు వెంటనే అతడిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. కాగా, అతనికి స్పృహ లేకపోవడంతో వివరాలు తెలియలేదు. బంధువులు ఎవరైనా ఉంటే కడప రిమ్స్ ఆసుపత్రిలో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

పెన్నానదిలో వ్యక్తి గల్లంతు

సిద్దవటం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంతాటిపల్లె వద్ద పెన్నానదిలో చేపల వేటకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన పొట్టిగాండ్ల నందా(36) గల్లంతైనట్లు తెలిసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


గాలిస్తున్న గ్రామస్థులు, పోలీసులు

నకిలీ మద్యానికి 'సురక్ష యాప్'తో చెక్


కడపలో మద్యం షాపులో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజు

కడప క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యానికి చెక్ పెట్టేందుకు ఎక్సైజ్ శాఖ 'సురక్ష మొబైల్ యాప్'ను ఆవిష్కరించిందని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజు అన్నారు. కడప నగరంలోని పలు మద్యం దుకాణాలను కడప ఎక్సైజ్ క్రిష్ణకుమార్‌తో కలిసి ఆయన శనివారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మద్యం కొనుగోలు చేసేటప్పుడు అది ఒరిజినల్‌లో, డూప్లికేటో తెలుసుకునేందుకు యాప్ ద్వారా స్కాన్ చేస్తే తెలిసిపోతుందన్నారు. కస్టమర్లు ఈ యాప్‌ను తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. నకిలీది అయితే వెంటనే టోల్‌ఫ్రీ నంబరు 14405కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

జాతీయ స్థాయి అగ్రగామి శిక్షణా సంస్థ విశ్వం

- విశ్వం అవగాహనా సదస్సుకు విశేష స్పందన

తిరుపతి(విద్య), అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల శిక్షణలో జాతీయ స్థాయి అగ్రగామి శిక్షణా సంస్థగా విశ్వం విద్యాసంస్థలు నిలిచాయని ఆ విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్. విశ్వనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం పోటీ పరీక్షల కేంద్రంలో సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షలపై అవగాహన సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్లుగా విశ్వం విద్యా సంస్థలు సైనిక్, నవోదయ, మిలిటరీ పాఠశాలల ప్రవేశాలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ రాష్ట్ర జాతీయ స్థాయిలో అగ్రస్థానాలు సాధిస్తోందని చెప్పారు. 2025 ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రస్థాయి మొదటి ర్యాంకులు సాధించడం విశ్వం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల చివరి తేదీ అక్టోబరు 30 అని వెల్లడించారు. 4వ నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ప్రవేశ పరీక్షలకు అర్హులని తెలిపారు. ప్రవేశ పరీక్ష విధానం, నమూనా ప్రశ్నలు, మాక్ టెస్టులు, కోచింగ్ తదితర వివరాలకు వరదరాజనగర్‌లోని విశ్వం సైనిక్ నవోదయ పోటీ పరీక్షల కేంద్రం లోగాని, 8688888802/9399976999 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలి : ఐసీడీఎస్ పీడీ


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న అధికారులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బాలికల విద్య ప్రాముఖ్యత, అంతర్జాతీయ బాలిక దినోత్సవ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ ఆఫీసరు హరిప్రసాద్, డీఈఎంవో డి.భారతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

నవోదయలో ప్రవేశానికి గడువు పెంపు

రాజంపేట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): నవోదయ పాఠశాలలో 9, 11 తరగతుల్లో ప్రవేశానికి ఈనెల 23వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కె.గంగాధరన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరంలో 11వ తరగతిలో ప్రవేశానికి ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్నవారు అర్హులన్నారు. వీరికి 2026 ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం : ఐదుగురి అరెస్టు

నందలూరు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనమోహనపురం క్రాస్ సమీపంలో ఐదుగురిని అరెస్ట్ చేసి 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజంపేట రూరల్ ఇన్‌స్పెక్టర్ బీవీ రమణ, నందలూరు సిబ్బంది, అన్నమయ్య ఆర్ఎస్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఈనెల 17న మధ్యాహ్నం 3గంటలకు మండలంలోని ఎంఎం పురం క్రాస్‌రోడ్డు దగ్గరలో చాపల చిన్నయ్య పొలానికి ఉత్తర వైపున కంపచెట్లలో దాచి ఉంచిన 20 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఆవుల రవికుమార్, పొత్తపి పెంచలయ్య, బండారు సందీప్, కానకపర్తి వంశీకృష్ణ, ఇమిడి నాగరాజును అరెస్టు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన ఎర్రచందనం సుమారు 512.9 కేజీలు ఉండగా, దాని విలువ సుమారు రూ.6.85 లక్షలు ఉంటుందని తెలిపారు. ఈ కేసులో మరికొందరు పరారీలో ఉన్నారన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, తిరుపతిలోని ఆర్ఎస్ కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.


పోలీసుల అదుపులో ఎర్రచందనం దొంగలు


స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు

ఇంటర్మీడియట్ నాన్‌టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా మల్లికార్జున రాజు


మల్లికార్జున రాజును సత్కరిస్తున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా కడప నగరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ అసిస్టెంట్ ఎస్.మల్లికార్జునరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శనివారం కళాశాలలో ఆయనకు ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.సురేశ్, జిల్లా బాడీ సభ్యులు, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు, కారు ఢీ

- ఐదుగురికి తీవ్రగాయాలు

రామాపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బస్సు కారును ఢీకొనడంతో ఐదుగురికి గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... హైదరాబాద్ నుంచి అరుణాచలం వెళుతున్న కారును గువ్వల చెరువు ఘాట్ శివాలయం సమీపంలో మదనపల్లె నుంచి కడపకు వెళుతున్న కడప డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

- మరొకరికి గాయాలు

రాజంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయచోటి రోడ్డు పాలకేంద్రం సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయాలపాలయ్యాడు. స్థానిక అన్నమాచార్య యూనివర్సిటీలో నంద్యాల జిల్లా కోవెలకుంట్లకు చెందిన కె.మహేంద్రారెడ్డి (18), కె.నరసింహులు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. శనివారం సాయంత్రం వారు బైక్‌పై పుల్లంపేట మండలం ఎస్ఆర్ పాలెంలోని అటవీశాఖ పార్కుకు వెళ్లి తిరిగి వస్తుండగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఫ్లెక్సీ స్టాండును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మహేంద్రారెడ్డి అక్కడికక్కడే మృతిచెందగా వెనుక కూర్చున్న నరసింహులు గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ సీఐ నాగార్జున, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన మహేంద్రారెడ్డి

కలసపాడులో ఖాకీల కొరత



కలసపాడు పోలీస్‌స్టేషన్

కలసపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):జిల్లా సరిహద్దు ప్రాంతమైన కలసపాడు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. గత కొద్దికాలంగా పలువురు సిబ్బందిని ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో ఈ సమస్య ఏర్పడింది. అరకొర సిబ్బందితో శాంతిభద్రతలను పోలీసులు ఎలాకాపాడుతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌లో ఇద్దరు ఏఎస్‌ఐలు, ఆరు మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 19 మంది కానిస్టేబుళ్లు, ఆరు మంది హోంగార్డులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఒక ఏఎస్‌ఐ, నలుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ఆరు మందికానిస్టేబుళ్లు, నలుగురు హోంగార్డులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఆరు మంది కానిస్టేబుళ్లలో ఒకరు జిల్లా కోర్టుకు, ఒకరు బద్వేల్ కోర్టుకు వెళ్తుంటారు. నలుగురు హోంగార్డుల్లో ఒకమహిళా హోంగార్డు పగటిపూట విధులు నిర్వహిస్తుంటే మరొకరు కోర్టు సమన్లు పంపిణీకి వెళ్తుంటారు. దీంతో స్టేషన్‌లో తీవ్ర సిబ్బంది కొరత వల్ల మండలంలో శాంతిభద్రతలు ఎలాకాపాడుతారని మండల ప్రజలు వాపోతున్నారు. ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 గ్రామ పంచాయతీల్లోని 42 గ్రామాలున్నాయి. జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో ఇటీవల కాలంలో చిన్నచిన్న చోరీలు జరుగుతున్నాయి. దేవాలయాల్లో హుండీలు అపహరణ, రైతుల వ్యవసాయ మోటార్ల వద్ద కేబుల్‌వైర్లు కత్తిరించుకుపోవడం జరుగుతున్నాయి. ప్రధాన రహదారిపై సిద్దమూర్తిపల్లె వద్ద నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసు పట్టపగలే లాక్కొని వెళ్లారు. మండలానికి సమీపంలోని కొండల్లో ఎర్రచందనం పుష్కలంగా ఉన్నాయి. గతంలో కలసపాడు ప్రాంతం సమస్యాత్మక ప్రాంతంగా ఉండడంతో జిల్లా అధికారులు పెద్దఎత్తున సిబ్బందిని నియమించి శాంతిభద్రతలు కాపాడేవారు. ఇప్పటికైనా జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు స్పందించి తగినంత మేర సిబ్బందిని నియమించి మారుమూల ప్రాంతమైన కలసపాడు మండలంలో శాంతిభద్రతలు పరిరక్షించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మైలవరం మత్స్యశాఖ చైర్మన్‌గా శ్రీనివాసులు



మైలవరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మైలవరం మత్స్యశాఖ చైర్మన్‌గా యాదగిరి శ్రీనివాసులు శనివారం ఎన్నికైనట్లు మత్స్యశాఖ ఏఈ కిరణ్‌కుమార్ తెలిపారు. మైలవరంలోని మత్స్యశాఖ కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్‌గా శ్రీనివాసులు, వైస్‌చైర్మన్‌గా యేసన్న, సెక్రటరిగా నరనారాయణ, మరో ఎనిమిది మంది డైరెక్టర్లను ఎన్నుకున్నారు. మత్స్యశాఖ ఎన్నికలను డీడీ నాగయ్య పర్యవేక్షించారు.

వ్యాపార గదులు నిర్మించండి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం దేవస్థానం మాడవీధుల్లో అభివృద్ధిలో భాగంగా తొలగించిన పురాతన గదుల స్థానంలో కొత్త గదులు నిర్మించాలని బాధితులు కోరారు. ఆమేరకు బ్రహ్మంగారిమఠం మేనేజరు ఈశ్వరయ్యాచారికి వినతిపత్రం అందించారు. మూడు నెలలు కావస్తు న్నా వ్యాపారస్తులు తమ వ్యాపారాలు చే సుకోలేక ఇబ్బందులకు గురవుతున్నా ర న్నారు. వ్యాపార సముదాయాలను డిప్యూ టీ కమిషనరు గురుప్రసాద్ పరిశీ లించారు.

ముగిసిన శిక్షణ

చాపాడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అధికారులకు శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.

రాష్ట్రోపాధ్యాయ నూతన సంఘం ఎంపిక

బద్వేలు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రోపాధ్యాయ సంఘం మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటసుబ్బయ్య, ఎన్వీ సుబ్బారెడ్డిలను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ ఇలియాస్‌బాషా పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రీజియన్ సర్వసభ్య సమావేశంలో నూతనకార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. ఆర్థిక కార్యదర్శిగా విజయసింహ, ఉపాధ్యక్షులుగా వెంకటసుబ్బయ్య, సుబ్రమణ్యం, భారతి, రవీంద్రరెడ్డి, నాగప్పచారి తదితరులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగిరెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ పాల్గొన్నారు.

ఏటూరులో ఐదుగురు జూదరుల అరెస్టు

కొండాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏటూరు గ్రామంలో పోలీసులు శనివారం ఐదుగురు జూదరులను అరెస్టు చేశారు. కంపచెట్లలో జూదమాడుతుండగా ఐదుగురిని అరెస్టు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై శివనాగిరెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ.2140 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే సహించం

బద్వేలుటౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. బద్వేలు మున్సిపాలిటీలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు లేక ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని, అధికారులు స్పందించి సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు విడుదల చేస్తే బాగుంటుందని పలువురు కౌన్సిలర్లు సభ దృష్టికి తెచ్చారు. ఇల్లులేని నిరుపేదలకోసం నూతన ఇంటినిర్మాణాన్ని చేప ట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని మున్సిపల్ చైర్మన్ సూచించారు. ప్రధానంగా సీసీ రోడ్ల సమస్యలు విన్నవించుకుంటున్నా నిధుల కొరతను సాకుగా చూపుతున్నారని ధ్వజమెత్తారు. ఇందుకు స్పందించిన మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి ఒకింత అసహనం వ్యక్తం చేసి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని, ప్రజా సమస్యల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

పంచాయతీలు స్వయం సమృద్ధిని సాధించాలి


సర్పంచులు, డిజిటల్ అసిస్టెంట్లతో ఎంపీడీవో తదితరులు

ఎర్రగుంట్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలు స్వయం సమృద్ధిని సాధించినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని ఎంపీడీవో వెంకటరమణ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు స్వయంగా ఆదాయ సృష్టి పెంచుకునే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. ఈవిషయంపై సర్పంచులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, కార్యదర్శులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఈవోఆర్డీ రంతులయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను తెలుసుకోండి

మైదుకూరు రూరల్,అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) :బంగారు కుటుంబాలను గుర్తించి వారి అవసరాలను తెలుసుకొని మొబైల్‌లో నమోదు చేయాలని పీ4 జిల్లా అధికారి పువ్వాడి వినోద్ కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మండలంలోని సచివాలయం ఉద్యోగులకు పీ4 మొబైల్ అప్లికేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, నాగేంద్రప్రసాద్ పంచాయతీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి ఉంటేనే టపాసులు విక్రయించాలి

పోరుమామిళ్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):.దీపావళి సందర్భంగా ప్రభుత్వ అనుమతి ఉన్నవారు మాత్రమే టపాసుల స్టాల్స్ ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరపాలని లైసెన్సు లేకుండా అమ్మితే కేసులు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ అధికారులు నిర్ణయించిన ప్రదేశాల్లో నే స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. స్టాల్స్ వద్ద నీటి బకెట్లు, ఇసుక బస్తాలు ఉంచాలన్నారు. టపాసులు అమ్మే దుకాణాల్లో చిన్న పిల్లలతో పనిచేయించుకోరాదన్నారు.

బాలికలను సంరక్షించాలి

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలికలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ నాగలమల్లేశ్వరి పేర్కొన్నారు. సేవ్‌ద చైల్డ్ క్యాంపెయిన్‌లో భాగంగా పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో బాలికల ఆవశ్యకత, ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీప వరప్రసాద్, చంద్రకళ, స్టాఫ్‌నర్సు సావిత్రి, ఫార్మసిస్టు సురేంద్ర, సీహెచ్‌వోలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గురుకుల బాలికలు

మైదుకూరు రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : అండర్ 19 వాలీబాల్ పోటీలలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపికయ్యారని జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. అన్నమయ్య జిల్లా చిన్నమండెంలో జిల్లా స్థాయి అండర్ 19 వాలీబాల్ పోటీలలో మంచి ప్రతిభ చూపిన చిట్టి, శ్రావ్యా గాయత్రి, చరితలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి చెస్ కాంపిటీషన్ నందు పల్లవి మొదటి స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

వ్యాధుల పట్ల జాగ్రత్తలు పాటించాలి

ఎర్రగుంట్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు శ్రీనాథ్‌రెడ్డి, ఇంటర్ ప్రిన్సిపాల్ కనపర్తి త్రివిక్రంరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా వారు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నాగమహేశ్వరరెడ్డి, నంటెప్ప తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై చైతన్యం పెరగాలి


ర్యాలీ చేపట్టిన ఆర్టీవో మనీషా, రవాణా శాఖ సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వాహనాలు, వాటి విడిభాగాలపై కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ ధరలపై వినియోగదారులు అవగాహనతో కొనుగోళ్లు చేయాలని ఆర్టీవో మనీషా పేర్కొన్నారు. శనివారం ప్రొద్దుటూరు పట్టణంలోని త్రీటౌన్ పోలీసు స్టేషన్ వద్ద నుంచి పుట్టపర్తి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. మైకుల ద్వారా ప్రజలకు చేకూరుతున్న ప్రయోజనాలను వివరించారు. ఎంవీఐ నాయక్, ఏసీటీవో వెంకటరామయ్య పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

మైదుకూరు అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):మైదుకూరు నియోజకవర్గానికి చెందిన 18 మంది బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి కింద రూ.12,35,108 చెక్కులను మైదుకూరు ఎంఎల్ఏ పుట్టా సుదాకర్ యాదవ్ శనివారం అందించారు. ప్రొద్దుటూరు లోని ఎంఎల్ఏ క్యాంపు ఆఫీసులో బాధితులకు ఆయన అందజేశారు. మైదుకూరు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్నా పాల్గొన్నారు.

పేదల భూములకు పట్టాలు మంజూరు చేయాలి

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమిరెడ్డిపల్లె రెవెన్యూ పొలంలో పేదలు సాగు చేసుకుని అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. ఆ మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో మండల తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోమిరెడ్డిపల్లె, మద్దిరెడ్డి పల్లె, గొల్లపల్లె గ్రామాల్లోని దాదాపు 150 మంది భూమిలేని పేదలు రెండు సంవత్సరాల పాటు పోరాటం నిర్వహించి ఆముదాలు, ఉలవ పంటలను పండించారన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలి


బద్వేలులో సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్డీవో చంద్రమోహన్

బద్వేలు , అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు మొక్కలను విరివిగా పెంచాలని బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శని వారం క్లీన్ ఎయిర్ కార్యక్రమం చేప ట్టారు. ఇందులో భాగంగా ఆర్డీవో చంద్ర మోహన్, తహశీల్దారు ఉదయభాస్కర్‌రా జు, తదితర అధికారులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గాలి కాలుష్యాన్ని నివారించడం, కోసం ప్రజలలో అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీ నిర్వహించినట్లు ఆర్డీవో తెలిపారు. స్వచ్ఛమైన గాలి కోసం మొక్కల పెంపకాన్ని వృద్ధి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గోపవరం తహశీల్దారు త్రిభువన్‌రెడ్డి, అర్బన్ సీఐ లింగప్ప, ఫారెస్టు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న నాయకులు

మైదుకూరులో:ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మైదుకూరు మున్సిపల్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ దాసరి బాబు శని వారం మొక్కలు నాటారు.ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం పెరిగి ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం ద్వారా ప్రకృతి సమతౌల్యాన్ని పెంచడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, మున్సిపల్ కమిషనర్ రంగస్వామి, ఏఈ నిరంజన్‌రెడ్డి, టీడీపీ నాయకులు శ్రీను, సునీత, ప్రసాద్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం


సైకిల్ తొక్కుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు, వ్యక్తిగత్త పరిశుభ్రతను పాటించడం వలన ఆరోగ్యంగా జీవించవచ్చని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి విజయకుమార్ సర్కిల్ అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ అవసరాలకోసం మోటారు వాహనాల వినియోగాన్ని తగ్గించి సైకిల్‌ను ఉపయోగించాలని సూచించారు. మోటారు వాహనాలను తగ్గించడం వలన కాలుష్యం తగ్గిపోయి స్వచ్ఛమైన గాలి వస్తుందన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల నిషేధం అమలులో ఉందని, ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.


జమ్మలమడుగులో ర్యాలీ నిర్వహిస్తున్న కమిషనర్

జమ్మలమడుగులో: పరిసరాల పరిశుభ్రత తోనే ఆరోగ్యంగా ఉండగలరని జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి సూచించారు. శనివారం జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండు, కూరగాయల మార్కెట్ వీధి తదితర వీధుల్లో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రోడ్లపై కాలువల్లో ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలు పడవేయరాదన్నారు. తడి, పొడి చెత్త వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, పారిశుధ్య సిబ్బంది, పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలితో ఆరోగ్యమైన జీవనం



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛమైన గాలిని అందింగలిగినప్పుడే ఆరోగ్యమైన జీవనం సాధ్యమవుతుందని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లె, గోపవరం పంచాయతీల్లో స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే సైకిల్ ర్యాలీని చేపట్టి ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో బాలన్న, గోపవరం కార్యదర్శి రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో రామాంజనేయులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం: పర్యావరణ పరిరక్షణలో పరిసరాల శుభ్రత ముఖ్యమని కామనూరు వైద్యాధికారి డాక్టర్ నాగమల్లేశ్వరి, పంచాయతీ సెక్రటరి సుబాషిణి తెలిపారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మొక్కలను నాటాలని సోలార్ విద్యుత్తును వినియోగించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ బీప వరప్రసాద్, చంద్రకళ, పీహెచ్‌సీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: స్వచ్ఛమైన వాతావరణం కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కమిషనర్ పేర్లి శేషఫణి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు కలుషితమౌతున్న వాతావరణాన్ని మొక్కలు నాటి పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు, హెచ్ఎం అరుణకిరణ్‌లు పాల్గొన్నారు.


చాపాడులో: మండల కేంద్రమైన చాపాడులో స్వచ్ఛ ఆంధ్ర ..స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంపై అధికారులు, టీడీపీ నాయకులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో వీరకిశోర్, ఏపీవో జగదీష్‌రెడ్డి, ఎంఈవో రవిశంకర్, ఏపీఐడీసీ డైరెక్టర్ అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రైతు సేవా కేంద్రం వద్ద డైరెక్టర్ మొక్కలు నాటారు.

బద్వేలు రూరల్‌లో: స్వచ్ఛమైన గాలి పీల్చేందుకు మొక్కలు నాటి పెంచడమే మార్గమని ఎంపీడీవో మల్లీశ్వరి అన్నారు. శనివారం వనంపుల గ్రామ పంచాయితీలో ఉపాధి హామీ సిబ్బంది చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. అన్ని పంచాయతీల్లో వాయుకాలుష్యం నివారించేందుకు మొక్కలు నాటాలని కోరారు.

కాశినాయనలో: స్వచ్ఛమైన గాలితోనే పరిశుభ్రమైన వాతావరణం నెలకొని ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపీడీవో మైథిలీరెడ్డి పేర్కొన్నారు.శనివారం నర్సాపురంలో స్వచ్ఛాంధ్ర.... స్వర్ణాంధ్ర కార్యక్రమం కింద మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఈవోపీఆర్డీ, ఉపాధ్యాయులు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ముద్దనూరులో:ప్రకృతిని కాపాడుకోవాల్సి అవసరం ఎంతైనా ఉందని ఎంపీడీవో రాధాక్రిష్ణవేణి పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. అంతకు ముందు ర్యాలీగా పాత బస్టాండుకు చేరుకొని, మానహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు, ఏపీవో గంగయ్య, ఏపీఎం అపర్ణదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ఇన్‌చార్జిగా రితేష్‌రెడ్డినే కొనసాగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ కౌన్సిలర్ అబ్రహం

బద్వేలు, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా మాజీమంత్రి స్వర్గీయ బిజివేముల వీరారెడ్డి వారసులైన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డిలనే కొనసాగించాలని మాజీ కౌన్సిలర్, టీడీపీ నాయకులు సమ్మెట అబ్రహం, అనిల్, ఐజయ్యలు పేర్కొన్నారు. శనివారం వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బద్వేలు టీడీపీ ఇన్‌చార్జి మార్పుపై సోషల్ మీడియాలో వస్తున్న వార్తల విషయంలో నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నేతలలో గందరగోళంనెలకొందన్నారు. టీడీపీ పార్టీ, అధికారంలో ఉన్నా లేకున్నా గత కొన్నేళ్లుగా విజయమ్మ, రితేష్‌లు పార్టీ నాయకులకు అండగా ఉంటూ వారి కష్టనష్టాలనుతెలుసుకుని అన్ని విధాలా ఆదుకుంటూ టీడీపీని బలోపేతం చేస్తున్నారన్నారు. టీడీపీని నమ్ముకున్న ప్రతి కార్యకర్తకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కుటుంబం ఏ పదవులు ఆశించకుండా పార్టీ కోసం కష్టపడ్డారన్నారు. కడప డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, బద్వేలు నియోజకవర్గ టీడీపీఇన్‌చార్జి రేసులో ఉన్నట్లు వార్తలు వస్తున్నాయని వెంటనే సూర్యనారాయణరెడ్డి దీనిని ఖండిస్తూ ఒక ప్రెస్‌నోట్ విడుదల చేయాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, రితేష్‌రెడ్డిల నాయకత్వంలోనే పనిచేస్తామని ఇతరులు అధిష్టానం ఏదైనా నిర్ణయం తీసుకుంటే నియోజకవర్గంలో టీడీపీ భారీ మూల్యం చెల్లించక తప్పదని వారు పేర్కొన్నారు.